క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ములుగు రూరల్ : ములుగు పట్టణ పరిధిలో నేడు (ఆదివారం)విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ సాయికృష్ణ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ సబ్ సేష్టన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు అంతరాయం కలుగుతుందన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



మంగపేట: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 145 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదిముభారక్ చెక్కులను తహసీల్దార్ బైరి వీరస్వామి మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్ఐ శ్రీనివాస్, ఏసుపాదం వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన



వరి పైరును పరిశీలిస్తున్న అధికారులు

వెంకటాపురం(ఎం): మండలంలోని రామాంజాపూర్ పరిధిలో గల వరిపంటలను ములుగు సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీపాల్, మండల వ్యవసాయాధికారిణి మేరుగు కళ్యాణిలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరిపైర్లు పొట్టదశలో ఉన్నాయని, ప్రస్తుతం కాండం తొలిచే పురుగు ఉధృతి ఉన్నట్లు పేర్కొన్నారు. దీని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు లేదా ఐసోసైక్లోసిరమ్ 120.మి.లీ పంటపై పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. వారి వెంట ఏఈఓ కావ్య, రైతులు ఉన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న నాగరమేష్

మంగపేట: మండలంలోని అకినేపల్లిమల్లారానికి చెందిన పూజారి నరేష్ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను శ్రీ రామకృష్ణ సేవా ట్రస్టు చైర్మన్ బాడిష నాగరమేష్ శనివారం పరామర్శించారు. ట్రస్టు ఆధ్వర్యంలో 25 కేజీల బియ్యం, రూ.4,000 నగదు అందజేశారు. పెసా జిల్లా అధ్యక్షుడు డబ్బుల ముత్యాలరావు, రూప భద్రయ్య, ట్రస్టు వైస్ చైర్మన్ బాడిష నవీన్, సభ్యులు ఇందారపు రమేష్, మునిగెల మహేష్, చౌళం వేణు, కొమరం నితిన్, జయరాజు, రవి, శివ, వెంకన్న, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

కేసు నమోదు



వాజేడు: ఛత్తీస్‌గఢ్ నుంచి గుడుంబా తరలిస్తున్న వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్లు పేరూరు పోలీసులు తెలిపారు. ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ధర్మవరం గ్రామ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో చెరుకూరు గ్రామానికి చెందిన అల్లి వెంకటేశ్వరరావు ద్విచక్ర వాహనంపై గుడుంబా తరలిస్తుండడంతో అదుపులోకి తీసుకోని ద్విచక్రవాహనాన్ని, గుడుంబాను స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నర్సరీల సందర్శన



మల్హర్: మండలంలోని రుద్రారం, ఎడ్లపల్లి, కొయ్యూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను ఏపీఓ గిరి హరీష్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ.. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున షెడ్ నెట్స్ ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. రోజు ఉదయం, సాయంత్రం వాటరింగ్ చేయాలన్నారు. అలాగే ఖాళీగా ఉన్న బ్యాగుల్లో లోకల్ స్టంప్స్, విత్తనాలు నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు భాస్కర్, ప్రసాద్, ఫిల్డ్‌అసిస్టెంట్స్ రవిశంకర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అడవికి అగ్గిముప్పు

- వన్యప్రాణులకు పొంచిఉన్న ప్రమాదం
- నివారణ చర్యలు శూన్యం
- పట్టించుకోని అధికారులు

ఎస్ఎస్‌తాడ్వాయి : అడవుల్లో మంటలు చెలరేగుతున్నాయి. మండలంలోని తాడ్వాయి నుంచి కాటాపూర్ వెళ్లే దారిలో అడవి మంటలతో కాలిపోతోంది. ఆకురాలే కాలం కావడంతో మన్యంలోని చెట్ల ఆకులు రాలిపోయాయి. దీంతో నిప్పు అంటుకుని అడవులు దహనమవుతున్నాయి. అడవులు కాలిపోవడంతో వన్యప్రాణులకు ప్రమాదం పొంచి ఉంది. అంతేకాకుండా మంటలకు భారీగా అడవిలో పొగ వ్యాపించడంతో జంతువులు అనారోగ్యం బారినపడే అవకాశం ఉందని వనప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు వేసవి కాలంలో అడవుల్లో మంటల నివారణ చర్యలు తీసుకోవాల్సి ఉండగా పట్టింపు లేనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. అడవుల్లోకి మంటలు వ్యాపించకుండా ఏర్పాటు చేసిన ఫైర్ ఇంజన్లు కూడా సత్ఫలితాలు ఇవ్వలేదనే విమర్శలు ఉన్నాయి. అడవులు కాలుతున్న విషయంపై వాహనదారులు, గ్రామస్తులు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చిన పట్టించుకోవడం లేదు. దీంతో అడవులు కాలిపోవడంతో జీవరాశులు, విలువైన మొక్కలు మంటలకు కాలిపోతున్నాయి. అధికారులు స్పందించి అడవులు దహనం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



తాడ్వాయి-గంగారం సమీపంలో కాలుతున్న అడవి

తునికాకు కాంట్రాక్టర్ల పనేనా.?

తునికాకు సీజన్ త్వరలో ప్రారంభం కానుంది. తాడ్వాయి, మేడారం, లింగాల రేంజ్‌ల పరిధిలో తునికాకు సేకరణకు బీడీ కాంట్రాక్టర్లు టెండర్లు పొందారు. దీంతో అడవుల్లో తునికాకు కొమ్మ (ప్రూనింగ్) కొట్టారు. ఆకు ఏపుగా, నాణ్యతగా పెరగాలని కాంట్రాక్టర్లు కూలీలతో నిప్పు అంటిస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. దీంతో అడవుల్లో ఎక్కడపడితే అక్కడ గుర్తుతెలియని వ్యక్తులతో నిప్పు అంటించడంతో అడవులు కాలిబూడిదవుతున్నాయి. కాంట్రాక్టర్ల స్వలాభం కోసం అడవులను తగులబెడుతున్న అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సీజన్ ప్రారంభానికి ముందే అటవీశాఖ ఉన్నతాధికారులు బీడీ కాంట్రాక్టర్లకు, గ్రామస్తులకు అడవుల్లో నిప్పటించకూడదని అవగాహన నిర్వహించాల్సి ఉంది. కానీ అధికారులు కాంట్రాక్టర్లకే వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు వస్తున్నా యి. ఉన్నతాధికారులు స్పందించి అడవులు కాలి పోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హక్కుల పరిరక్షణపై అవగాహన తప్పనిసరి

ములుగు రూరల్: విద్యార్థులు ఆవిష్కరణలు, ట్రేడ్ మార్క్స్‌పై హక్కులు పొందడం, పరిరక్షణపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని హైకోర్టు న్యాయవాది అశోక్ అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేధో సంపత్తి, హక్కు పొందే విధానాన్ని వివరించారు. విద్యార్థులు తమ రచనలకు ఏవిధంగా కాపీ రైట్స్ పొందవచ్చనే అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సమ్మయ్య, కోఆర్డినేటర్ వెంకన్న, అధ్యాపకులు మహేందర్, యాకూబ్, ఉమాదేవి, నాగమణి, అనిల్ కుమార్, విజిత, శంకర్ తేజోలత తదితరులు పాల్గొన్నారు.

కుంగ్-ఫూతో ఆత్మరక్షణ

కాళేశ్వరం: కుంగ్-ఫూ నేర్చుకోవడంతో బాలికలకు ఆత్మస్థైర్యం పెంపొందడంతోపాటు, ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని హెచ్ఎం సత్యం అన్నారు. మండల కేంద్రంలో శనివారం జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో డ్రాగన్ స్పార్క్ కుంగ్-ఫూ ఆధ్వర్యంలో బెల్టుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతోపాటు, ఆత్మరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలన్నారు. మూడు నెలలుగా పాఠశాలలో మాస్టర్ మహేష్ ఆధ్వర్యంలో కుంగ్-ఫూలో శిక్షణ పొందిన 20 మంది విద్యార్థులకు ఎల్లో (పసుపు రంగు) బెల్టులతోపాటు సర్టిఫికెట్లను అందజేశారు.

పదోతరగతి పరీక్షలపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంఈఓ సురేందర్



అవగాహన కల్పిస్తున్న ఏటీఓ ముబీన్

ఏటూరునాగారం : రేపటినుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు మండల కేంద్రంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ సురేందర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్‌లో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఇన్విజిలేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జెడ్పీఎస్ఎస్ ఏటూరునాగారం(ఏ), బీ సెంటర్లు, క్రాస్‌రోడ్డులోని గురుకుల స్పోర్ట్స్ స్కూల్ పరీక్ష కేంద్రాలుగా కేటాయించామన్నారు. ఏటూరునాగారంలోని ఎనిమిది పాఠశాలలు, కన్నాయిగూడెంలోని నాలుగు పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులు మొత్తం 437 మంది పరీక్షలు రాస్తున్నారన్నారు. గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాని, 5 నిమిషాల ఆలస్యంతో పరీక్ష కేంద్రానికి అనుమతిస్తారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లు పరీక్ష ముగిసే వరకు మూసివేయాలన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను సకాలంలో తీసుకురావాలని ఆయన కోరారు.

పది విద్యార్థులకు అవగాహన

మంగపేట మండలంలోని కమలాపురం జెడ్పీఎస్ఎస్ విద్యార్థులకు ఐటీఐలో ప్రవేశానికి ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో విద్యార్థులు చేరేందుకు ఐటీఐ ఏటీఓ వావిలాల ముబీన్ కుమార్ శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఐటీఐలో చేరాలని ఆయన కోరారు. పదోతరగతి, ఐటీఐ చదవడం వల్ల కలిగే లాభాలను, ఐటీఐ ఆవశ్యకతను, ప్రవేశాలకు సంబంధించిన అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. పదోతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. హెచ్ఎం శ్రీనివాస్, ఏటీఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూలీలు జాగ్రత్తలు పాటించాలి

వెంకటాపురం(ఎం): ఉష్ణోగ్రతలు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో వ్యవసాయదారులు, కూలీలు ఉదయం 10గంటలలోపే పనులు ముగించుకొని ఇళ్లకు చేరి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి చీర్ల శ్రీకాంత్ తెలిపారు. శనివారం మండలంలోని ఇంచెంచెరువుపల్లి, సుబ్బక్కపల్లి, బండ్లపహాడ్ గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించి 140 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుబ్బక్కపల్లి గ్రామంలో డాక్టర్ లోకప్రియ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రజలు ఎండకు వెళ్లినపుడు ఎక్కువ నీటిని తీసుకోవాలని, అవసరమైతే ఓఆర్ఎస్ పౌడర్‌ను నీటిలో కలుపుకొని తాగడం వల్ల డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సంఘమిత్ర, చందన, ఏఎన్ఎంలు ఫాతీమా, శోభా, సులోచన, హెల్త్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ప్రతాప్

వాజేడు: భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడు పూనెం ప్రతాప్ అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలో కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. 5వ షెడ్యూల్‌లో భూ భాగమైన భద్రాచలం కేంద్రంలో ఆదివాసీ యువత కోసం న్యాయ కళాశాల అవసరమన్నారు. ఆదివాసీ చట్టాలు, జీఓలు ఉన్నప్పటికీ పాలకులు చట్టాలను తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ యువత ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ నాయకులు ఆదివాసీల హక్కులు, చట్టాలను కాలరాస్తూ పార్టీల జెండాలను మోయిస్తున్నారని విమర్శించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం తయారు చేసే మేనిఫెస్టోలో 1/70, పెసా చట్టాలను అమలు చేస్తామని పొందుపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట కృష్ణ, కృష్ణ, రాజేష్, చంటి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై అశోక్

వెంకటాపురం(కె) : బడీడు కలిగిన పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించాలని వెంకటాపురం ఎస్సై అశోక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని యాకన్నగూడెం గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. కాగా గ్రామంలో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మద్యం, గంజాయి వల్ల కలిగే అనర్థాలను గ్రామస్తులకు వివరించారు. మద్యపాన నిషేధానికి గ్రామస్తులు, పోలీస్ సమక్షంలో తీర్మానించారు. స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు పొందేందుకు ఎల్లప్పుడు తమ సహకారాలు అందిస్తామని పోలీసులు చెప్పారు. గ్రామంలోకి ఎవరైనా అపరిచితులు వచ్చినట్లైతే వారి సమాచారాన్ని తక్షణమే పోలీసులకు అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సేవలు అభినందనీయం

- మంత్రి సీతక్క
- గొత్తికోయలకు సోలార్‌లైట్లు పంపిణీ

ఎస్ఎస్‌తాడ్వాయి : మారుమూల ప్రాంతంలోని గొత్తికోయల గూడెంలో వెలుగులు నింపేందుకు దాతలు సోలార్ లైట్ల పంపిణీ అభినందనీయమని రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐటీడీఏ భవనంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆధ్వర్యంలో సోలార్ లైట్ల పంపిణీ కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తాడ్వాయి, వెంకటాపూర్, కన్నాయిగూడెం, ఏటూరునాగారం, మంగపేట ప్రాంతంలోని గొత్తికోయలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్‌లతో కలిసి మంత్రి సీతక్క 50 సోలార్ లైట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. దాతలు ముందుకు వచ్చి మారుమూల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న గొత్తికోయ గూడెంలకు సహాయం అందించడం సంతోషకరమన్నారు. అనంతరం సర్కిల్ అధికారి విశాల్ భాటియా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సీతక్క వంటి నాయకురాలు ఉండటం అదృష్టమన్నారు. కరోనా సమయంలో సీతక్కతో కలిసి నియోజకవర్గంలో ప్రజలకు సాయం చేశానని గుర్తు చేశారు. మొదటి విడతలో భాగంగా 50 సోలార్ లైట్లు అందించడం జరిగిందని, అదేవిధంగా మరోసారి సోలార్ లైట్లు పంపిణీ చేస్తామన్నారు. ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)శ్రీజ, ఏటూరునాగారం ఏఎస్పీ గీతే మహేష్ బాబాసాహెబ్, ములుగు హెచ్‌డీఎఫ్‌సీ బ్రాంచ్ మేనేజర్ సురేష్, అధికారులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

మంగపేట : రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మంత్రి అనే హడావుడి లేకుండా సాదాసీదాగా, ఎంతో ఓపికతో స్థానికుల సమస్యలపై శనివారం వినతులు స్వీకరించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి సీతక్క మండల కేంద్రానికి వచ్చారు. కాగా లోక్ సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లేక పోయింది. మండల కార్యాలయంలో సరిపడ స్థలంలేక పోవడంతో బీసీ హాస్టల్ పక్కనే ఉన్న బహిరంగ స్థలంలో కార్యకర్తలతో మాట్లాడేందుకు సమయాన్ని కేటాయించారు. ఈ క్రమంలో మంత్రి రోడ్డు పక్కన సుమారు గంటన్నర పాటు అక్కడే కూర్చొని బిల్డ్ కార్మికులు, ఉపాధిహామీ కూలీల సమస్యలను ఎంతో ఓపికతో వింటు వారి వినతులను స్వీకరిచారు. అదే విధంగా పలువురి నుంచి వివిధ రకాల సమస్యలపై వినతులను స్వీకరించారు. మండలంలో నాయకులు వ్యవహరించే తీరుపై సున్నితంగా మందలించారు. మండల కేంద్రంలో ఎక్కడైనా కూర్చుని మాట్లాడేందుకు స్థలం లేకుండా పోయిందా అంటూ అసహనం వ్యక్తం చేశారు. సీతక్క వెంట మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాధాకృష్ణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, జిల్లా నాయకులు వల్లెపల్లి శివప్రసాద్, అయ్యోరి యానయ్య, మండల నాయకులు పల్లికొండ యాదగిరి తదితర నాయకులు పాల్గొన్నారు.



ఎఫ్ఏల వినతులను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

ఉన్నత స్థాయికి చేరుకోవాలి



పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఏటూరునాగారం: కుటుంబంలో ఒకరు విద్యను నేర్చుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం(ఆర్ఓఎస్ఏ) అధ్యక్షుడు చాప బాబుదొర అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్పోర్ట్స్ గురుకుల కళాశాల, పాఠశాలలో 10వ తరగతి చదువుకుంటున్న 70 మంది విద్యార్థులకు రెసిడెన్షియల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఐఆర్ఎస్, జడ్జి, లాయర్లు, తహసీల్దార్, డాక్టర్లు, తదితర ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారన్నారు. మీరు కూడా ఉన్నత విద్య చదివి తల్లిదండ్రులకు అండగా నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజారామ్, సంఘం ఉపాధ్యక్షుడు కొమురం ప్రభాకర్, కార్యదర్శి పుల్సం పురుషోత్తం, భవాని శంకర్, రవీందర్, ఉస్సిలాల్, సిబ్బంది పాల్గొన్నారు.

భూమి పూజ

మహదేవపూర్ : మండలంలోని ఎనుకపల్లి గ్రామంలో రూ.2 లక్షల నిధులతో బోర్‌వెల్‌కు జెడ్పీటీసీ అరుణ శనివారం భూమి పూజ నిర్వహిచారు. ప్రత్యేక అభివృద్ధి నిధుల(ఎస్‌డీఎఫ్) ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికి తాగు నీరును అందించేందుకు బోర్ వేస్తున్నామని తెలిపారు.

కాళేశ్వరం: మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామం 1వ వార్డులోని ఎస్సీ కాలనీలో వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు తీర్చడానికి బోరువెల్ కోసం ఎంపీటీసీ మమత శనివారం భూమి పూజ చేశారు. బోర్ మోటార్ ఏర్పాటుకు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



ఏటూరునాగారం: ప్రతిజ్ఞ చేస్తున్న టీచర్లు, హేమలత



అవగాహన కల్పిస్తున్న దొడ్డ కృష్ణ

- సీడీపీఓ స్వాతి

ఏటూరునాగారం : ఏజెన్సీలోని అన్ని గ్రామాలను రక్తహీనత రహిత ప్రాంతాలుగా ఎదిగే విధంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కృషి చేయాలని సీడీపీఓ హేమలత అన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని నేతాజీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హేమలత హాజరై మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు రక్తహీనత లేకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో రోజు గర్భిణులు, బాలింతలకు ఉడకబెట్టిన కోడిగుడ్డు, 200ఎంఎల్ పాలు ఇస్తారని, అవి తీసుకోవడం వల్ల రక్తహీనత నుంచి ఉపశమనం పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఏకేఘణపురం సెక్టార్ సూపర్‌వైజర్ ఆఫ్రీన్, అంగన్‌వాడీ టీచర్లు ఉదయ, లలిత, కృష్ణకుమారి, అన్నపూర్ణ, తల్లులు, పిల్లలు, ఆయాలు పాల్గొన్నారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని మాజీ సర్పంచ్ దొడ్డ కృష్ణ అన్నారు. శనివారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు, ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోషణ పక్వాడా ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోషకాహారం, చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే బాలామృతం పాలు గుడ్లు వినియోగించుకోవాలని సూచించారు. ఐదు సంవత్సరముల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. శిశువు పుట్టగానే ముర్రు పాలు పట్టిస్తే పోషకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విజయ, స్వరూపారాణి, భాగ్య, స్వర్ణలత, ఉపాధ్యాయులు రమాదేవి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడ వారోత్సవాలు

ఏటూరునాగారం మండల కేంద్రంలోని శివాలయం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ హేమలత హాజరై తల్లులు, టీచర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఆఫ్రీన్, ఐసీడీఎస్ సిబ్బంది ఇమాన్యుల్, టీచర్లు తరంగిణి, రాజేశ్వరి, సోమలక్ష్మి, శ్రీలత, విజయనిర్మల, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

వెంకటాపురం(ఎం): పోషకాహారంలో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ స్వాతి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన పోషణ పక్ష కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించి చేతుల శుభ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పిల్లలకు వివరించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిరుధాన్యాలు, గుడ్లు, ఆకు కూరలు వలన పిల్లల ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఐ రాణి, సీహెచ్‌ఎల్‌సీఓ నరేష్, సీహెచ్‌ఎల్ సీడబ్ల్యూ నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు కాంతాల మంజుల, చంటి రజిత, షాహిని సుల్తానా, ఫరీదా తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురం(ఎం): ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకెళ్లాలి

కాటారం: యువత లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకెళ్లి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందు సాయిలు, కాటారం ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కాటారం మండల కేంద్రంలోని ఇప్పలగూడెంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్న వయసులోనే దేశం కోసం ఉరికంభం ఎక్కి ప్రాణత్యాగం చేసిన మహోన్నత వ్యక్తి భగత్‌సింగ్ అని కొనియాడారు. భగత్‌సింగ్ చరిత్ర చదివితే దేశం, సమాజంపై అతడికి ఉన్న గౌరవం, ప్రేమ, దేశభక్తి అర్థం అవుతాయని పేర్కొన్నారు. యువత మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు కదలాలని సూచించారు. క్రీడలు, చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. శ్రమ, పట్టుదల, ఏకాగ్రత ఉంటే ఏదైన సాధించవచ్చని వివరించారు.